క్లుప్తంగా

పిరమిడ్ నిర్మాణానికి విరాళం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై నిర్మిస్తున్న శ్రీ నవనాథ సిద్ధేశ్వర పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రం నిర్మాణానికి డాక్టర్ కురుమాచలం నీలిమ రూ.50 వేలను విరాళంగా అందజేశారు. విశ్వ కళ్యాణంలో భాగంగా జగద్గురువు బ్రహ్మర్షి పితామహ సుభాష్ పత్రీజీ ఆదేశాల మేరకు సిద్ధుల గుట్టపై నిర్మాణం కొనసాగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



రుద్రూర్: మండల కేంద్రంలోని మహాలక్ష్మీ దేవి ఆలయంలో శుక్రవారం విండో మాజీ చైర్మన్ పత్తి రాము ఆధ్వర్యంలో ఆయన కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన తండ్రి దివంగత పత్తి గంగారాం జ్ఞాపకార్థం ఆలయానికి టేకు తలుపులను విరాళం అందించారు. కార్యక్రమంలో బోధన్ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్ రావ్ దేశాయ్, సింగిల్ విండో చైర్మన్ సంజీవ రెడ్డి, నీటి సంఘం మాజీ చైర్మన్ అక్కపల్లి నాగేందర్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం



మాక్లూర్: వల్లభాపూర్ చెరువు నీటి గుంతలో మునిగి మృతి చెందిన గూండ్ల ఎరుగట్ల రాము కుటుంబ సభ్యులకు శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొద్దుటూరి వినయ్‌రెడ్డి తన పార్టీ నాయకుల ద్వారా రూ.10 వేల నగదును అందజేశారు. కాల కృత్యాలు తీర్చుకోవటానికని వెళ్లిన గూండ్ల ఎరుగట్ల రాము(15) ప్రమాదవశాత్తూ జారి పడి మృతిచెందాడు. విషయం తెలిసిన వినయ్‌రెడ్డి మృతుని తల్లిదండ్రులకు రూ.10 వేల సాయం అందజేశారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు రవి యాదవ్, ఎస్‌కె ఆరిఫ్, రవిగౌడ్, చింత ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

శివసేన ఆధ్వర్యంలో..



బోధన్: పట్టణ కేంద్రానికి చెందిన బజరంగ్‌దళ్ పూర్వ కార్యకర్త రవీందర్ సింగ్ కొంత కాలం క్రితం అనారోగ్యంతోమృతి చెందాడు. ఆయన కుమార్తె వివాహానికి శివసేన రాష్ట్ర అధ్యక్షుడు సింకారి శివాజీ రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. శుక్రవారం రవీందర్ సింగ్ నివాసానికి నాయకులతో కలిసి వెళ్లారు.

రహదారులపై కేజ్‌వీల్స్ నడిపితే కఠిన చర్యలు

వేల్పూర్: రహదారులపై కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు నడిపితే సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వినయ్‌కుమార్ శుక్రవారం హెచ్చరించారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన రహదారులు కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు నడపడం వల్ల కొద్ది రోజులకే చెడిపోతున్నాయన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కేజ్‌వీల్స్ ట్రాక్టర్లకు పట్టీలు బిగించుకొని పొలాలకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాలను రైతులందరూ కచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు.

ఉపా చట్టాన్ని రద్దు చేయాలి

ఆర్మూర్: పౌర హక్కుల నేత ప్రొఫెసర్ హరగోపాల్, పాత్రికేయులు, ప్రజా సంఘాల నాయకులతో పాటు 152 మందిపై ఉపా చట్టం కింద పెట్టిన కేసును వెంటనే రద్దు చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా రాష్ట్ర నాయకుడు ప్రభాకర్ డిమాండ్ చేశారు. 'సాక్షి'తో ఆయన శుక్రవారం ఫోన్‌లో మాట్లాడారు. వివాదాలకు దూరంగా ఉండే వ్యక్తిగా పేరున్న హరగోపాల్‌పై కుట్ర కేసు పెట్టడం అన్యాయమన్నారు. ఈ కేసును రద్దు చేయకపోతే హక్కుల రక్షణ కోసం ఉద్యమ బాట పడతామని హెచ్చరించారు. 'సాక్షి'తో మాట్లాడిన వారిలో సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా జిల్లా నాయకులు రామకృష్ణ, ముత్తన్న, మల్లేశ్, డివిజన్ కార్యదర్శి దేవరాం, బాబన్న, కిషన్ తదితరులున్నారు.

హెల్త్ కార్డులు ఇవ్వండి

వర్ని : మధ్యాహ్న భోజన నిర్వాహకులకు హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించి, నిర్వాహకుల ఆరోగ్యాన్ని కాపాడాలని మధ్యాహ్న భోజన యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు మేఘనను శుక్రవారం వర్ని మండల కేంద్రంలో ఇంటి వద్ద పరామర్శించారు. మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 19న మండల విద్యాశాఖాధికారి కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టనున్నామని ఆయన తెలిపారు.

ప్రమాదకరంగా కోమట్‌పల్లి వంతెన

- కొత్తది నిర్మించేందుకు అంచనాలు రూపొందిస్తున్న అధికారులు
- మరి గుంతలు తేలిన రోడ్డుకు మోక్షమెప్పుడో?



గుంతలు తేలిన బీటీ రోడ్డు



డొంకేశ్వర్ మండలం కోమట్‌పల్లి వద్ద ఉన్న వంతెన

డొంకేశ్వర్(ఆర్మూర్): మండల పరిధిలోని కోమట్‌పల్లి వంతెన ప్రమాదకరంగా మారింది. రోడ్డుకు తగ్గ ఎత్తు లేకపోవడంతో వాహనాల రాకపోకలు కష్టంగా మారాయి. సైడ్‌వాల్ కూడా లేకపోవడంతో వాహనాలు అదుపుతప్పి గుంతలో పడుతున్నాయి. ఇప్పటికే చాలా ఘటనలు జరిగి గాయాలపాలయ్యారు. రాత్రుల్లో చీకటిగా ఉండటంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని కోమట్‌పల్లి ప్రజలు పేర్కొంటున్నారు. కాగా, వర్షాకాలం వస్తే కల్వర్టుపై నుంచి మోకాలెత్తు వరదనీరు పారుతుంది. దీంతో కల్వర్టు అక్కడక్కడా కోతకు గురైంది. వరద వస్తే నికాల్‌పూర్, నాలేశ్వర్, డొంకేశ్వర్ గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోతున్నాయి. తద్వారా దత్తాపూర్ ప్రధాన రోడ్డు గుండా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అయితే, నూతన కల్వర్టు బ్రిడ్జిని నిర్మించాలని స్థానిక సర్పంచ్ అధికారులపై ఒత్తిడి తేవడంతో పంచాయతీ రాజ్ అధికారులు అంచనా ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. దీని నిర్మాణానికి సుమారు రూ.70 లక్షల వరకు ఖర్చవుతుందని భావిస్తున్నారు.

గుంతలమయంగా రోడ్డు...

కోమట్‌పల్లి గ్రామానికి వెళ్లాలంటే షాపూర్ మీదుగా వెళ్లాలి. కోమట్‌పల్లి గ్రామస్తులు నికాల్‌పూర్, డొంకేశ్వర్ వెళ్లాడానికి వేసిన బీటీ రోడ్డు పూర్తిగా గుంతలు తేలింది. అడుగడుగునా కంకర తేలడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బీటీ రోడ్డు వేసేందుకు పంచాయతీ రాజ్ అధికారులు ఎలాంటి ప్రతిపాదనలు తయారు చేయలేదు. బ్రిడ్జి నిర్మాణంతో పాటు రోడ్డు కూడా వేయాలని అధికారులను కోరుతున్నారు.

వంతెన త్వరగా నిర్మించాలి

త్వరగా వంతెన నిర్మాణ పనులు చేపట్టాలి. లేదంటే ఈ వర్షాకాలం కూడా రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుంది. అలాగే రోడ్డు వేసేందుకు కూడా పంచాయతీరాజ్ అధికారులు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపాలి.

–నాగరాజు, కోమట్‌పల్లి సర్పంచ్

అంచనాలు సిద్ధం చేశాం

కోమట్‌పల్లి చెరువు వద్ద రోడ్డు మధ్యలో కల్వర్టు వంతెనను నిర్మించడానికి అంచనాలు రూపొందించాం. ప్రభుత్వానికి పంపి మంజూరు తీసుకుంటాం. నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం. రోడ్డు పనులకు సంబంధించి అంచనాలు తీసుకోవడానికి ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావాలి. – బాలాజీ, ఏఈ, పంచాయతీరాజ్

నాడు దుర్దశ.. నేడు మహర్దశ



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



వన్నెల్ కే గ్రామంలో పర్యటిస్తున్న జీవన్ రెడ్డి

- ఆర్మూర్ పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాం
- పట్టణ ప్రగతి కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి

ఆర్మూర్: సమైక్య రాష్ట్రంలో ఆర్మూర్ పట్టణానికి దుర్దశ పట్టగా.. కేసీఆర్ పాలనలో మహర్దశ పట్టి సుందరమైన పట్టణంగా మారిందని పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆర్మూర్ పట్టణంలోని క్షత్రియ కల్యాణ మండపంలో పట్టణ ప్రగతి దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా ఆర్మూర్ పట్టణంలో ఇప్పటి వరకు రూ.18 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఆర్మూర్ పట్టణ ప్రగతిలో భాగమైన మున్సిపల్ సిబ్బంది సేవలను కొనియాడుతూ ప్రశంసా పత్రాలను అందజేశారు.

'ఆర్మూర్' అంటేనే అభివృద్ధి

నందిపేట్ (ఆర్మూర్) : 'ఆర్మూర్' అంటేనే అభివృద్ధి రథమని, సబ్బండవర్గాల సంక్షేమ పథం అని ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అన్నారు. 'నమస్తే నవనాథ పురం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వన్నెల్ కే గ్రామంలో పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో పాల్గొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి గ్రామమంతా తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన అక్కడికక్కడే పరిష్కరించారు. వివిధ కుల సంఘాల భవనాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో జీవన్ రెడ్డి మాట్లాడుతూ..వన్నెల్ కే గ్రామంలో సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందించిన డబ్బుల గురించి వివరించారు. గ్రామంలో చేపట్టిన, చేపట్టబోయే పనుల గురించి తెలియజేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏం చేసిందో తాము ప్రతీ గ్రామంలో ప్రజల ముందు నిలబడి చెబుతున్నామని అన్నారు. మరోసారి తనను గెలిపించాలని ప్రజల్ని కోరారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

పెర్కిట్(ఆర్మూర్) : ఆర్మూర్ నియోజకవర్గంలోని 55 టేకేదార్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో బీఆర్‌ఎస్ కండువాలు కప్పి వారిని పార్టీలోనికి ఎమ్మెల్యే ఆహ్వానించారు.

నెల రోజుల్లో డబుల్ ఇళ్లు పంపిణీ చేస్తాం

- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి



పట్టణ ప్రగతి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి

భీమ్‌గల్: పట్టణంలో సుమారు 228 డబుల్ బెడ్ రూం ఇళ్లను నెల రోజుల్లోపు అర్హులకు అందజేస్తామని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం భీమ్‌గల్ పట్టణ కేంద్రంలో నిర్వహించిన పట్టణ ప్రగతి దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి వేముల మాట్లాడుతూ.. గడిచిన తొమ్మిదేండ్లలో భీమ్‌గల్ పట్టణ అభివృద్ధి కోసం రూ.250 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. కేవలం 15 వేల జనాభా ఉన్న చిన్న మున్సిపాలిటీలోనే ఇంత పెద్ద మొత్తంలో నిధుల చెల్లింపు జరిగిందంటే ప్రభుత్వం ఏ మేరకు సంక్షేమ అభివృద్ధికి పాటు పడుతుందో అర్థం చేసుకోవచ్చన్నారు. మిషన్ భగీరథ ద్వారా పట్టణంలో ఇంటింటికి నీరు అందించామని గుర్తు చేశారు. ఉత్తమ సేవలను అందించిన మున్సిపాల్ సిబ్బందిని సన్మానించి, మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

గిరిజనుల సంక్షేమానికి ప్రాధాన్యం

భీమ్‌గల్: గిరిజనుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నారని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. భీమ్‌గల్ మండలంలో నూతన జీపీలుగా ఏర్పడిన సంతోష్ నగర్ తండా, సుదర్శన్ నాయక్ తండాలలో రూ.20 లక్షల చొప్పున నిధులతో నిర్మిస్తున్న జీపీ భవనాలకు ఆయన శుక్రవారం భూమి పూజ చేశారు. మంత్రి మాట్లాడుతూ.. దేశంలోనే మరెక్కడా లేని విధంగా రాష్ట్రంలో బంజారాల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. ఐదు వందల జనాభా కలిగిన ప్రతీ తండాను జీపీలుగా మార్చడమే కాకుండా ఒక్కో జీపీ భవన నిర్మాణానికి రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.

కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ అమేర్



రాంపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహ్మద్ షకీల్

బోధన్‌రూరల్(బోధన్): సీఎం కేసీఆర్ పాలనలో కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమం పథకాలు అమలు, అభివృద్ధి జరుగుతోందని బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ అన్నారు. శుక్రవారం రాంపూర్‌లో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన జీపీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడాలేని విధంగా మన రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధి జరుగుతోందన్నారు. భవిష్యత్తులో సీఎం కేసీఆర్ అన్ని రకాల పింఛన్లను పెంచుతారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ఆశీస్సులతో బోధన్ నియోజకవర్గంలో 2014 నుంచి రూ.వేల కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేశానని తెలిపారు. కరోనా సమయంలో అవసరమైన వారికి ఆసుపత్రి ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందించడంతో పాటు 2 వేల ఆక్సిజన్ సిలిండర్‌లను పంపిణీ చేశానని గుర్తుచేశారు. రాంపూర్ గ్రామాభివృద్ధి కోసం ప్రత్యేకంగా కృషి చేస్తానన్నారు. జూలై 2 నుంచి గృహలక్ష్మి పథకం ద్వారా అర్హులైన ప్రతిఒక్కరికి ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షల సాయం అందిస్తామన్నారు. అనంతరం 100 రోజుల్లో జీపీ భవన నిర్మాణం పూర్తయ్యేలా కృషి చేసిన పీఆర్ ఈఈ బావన్న, ఏఈ సాయిలులను అభినందించారు. సర్పంచ్ ఉమాసుదర్శన్ రెడ్డి, ఎంపీపీ బుద్దె సావిత్రి, జెడ్పీటీసీ లక్ష్మి, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్లు శరత్, గంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయి,తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన దివ్యాంగులు

ఎడపల్లి/బోధన్: మండలానికి చెందిన 50 మంది దివ్యాంగులకు జానకంపేట్ గ్రామంలో ఇళ్ల స్థలాల పట్టాలు మంజూరు చేసినందుకు బోధన్ ఎమ్మెల్యే షకీల్‌కు ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఫించన్ మరో రూ. వెయ్యి పెంచినందుకు ఎమ్మెల్యేను స్వగృహంలో కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంపీటీసీ మంద సంజీవ్ కుమార్, చేపూరి శ్రీనివాస్, కోడెల లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో చేరికలు

బోధన్: బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీంద్రయాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణ కేంద్రానికి చెందిన బీజేపీ కార్యకర్తలు చరణ్, రవి, రమేశ్ పాటు నవీపేట మండలం మోకన్‌పల్లి, రెడ్డిఫారం, సలీంఫారం గ్రామస్తులు ఎమ్మెల్యే షకీల్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కండువా కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు.

తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారావు

ఆర్మూర్‌టౌన్: రానున్న ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తలు సైనికులుగా పనిచేసి తెలంగాణలో బీజేపీని అధికారంలో తీసుకురావాలని హన్మకొండ మాజీ ఎమ్మెల్యే మార్తనేని ధర్మారావు అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని మెడికల్ అసోసియేషన్ భవన్‌లో శుక్రవారం బీజేపీ మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎందరో బీజేపీ కార్యకర్తల త్యాగఫలం వల్ల ఈరోజు భారతదేశంలో బీజేపీ అధికారంలోకి రావడానికి కారణమైందన్నారు. ప్రతి కార్యకర్త పూర్తిస్థాయిలో నిజాయితీ, నిబద్ధత, పారదర్శకంగా పని చేయాలని, ఈ 300 రోజుల సమయం చాలా కీలకమైందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, ఆదిలాబాద్ ఇంచార్జ్ అల్జాపూర్ శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెద్దోళ్ల గంగారెడ్డి, నాయకులు లోకభూపతిరెడ్డి, నారాయణ, జీవీ నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా పట్టణ ప్రగతి దినోత్సవం



బోధన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి, అధికారులు

బోధన్‌టౌన్(బోధన్): తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బోధన్ మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం పట్టణ ప్రగతి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా బల్దియా కార్యాలయం నుంచి మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తాలో 10 సంఖ్యలో మానవ హారం ఏర్పాటు చేసి అనంతరం బల్దియా కార్యాలయానికి చేరుకున్నారు. కార్యాలయం ఆవరణలో ముగ్గుల పోటీ నిర్వహించారు. అనంతరం జాతీయ జెండాను మున్సిపల్ చైర్ పర్సన్ ఆవిష్కరించి జాతీయ గీతం ఆలపించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా 22.22 కోట్లు నిధులు మంజూరు చేశారని తెలిపారు. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దడానికి హరిత హారం కార్యక్రమంలో భాగంగా రూ. 3.98 లక్షలతో ట్టణంలో నాలుగు నర్సరీలు, 38 పకృతి వనాలు, ఒక మియావాకి ప్లాంటేషన్(యాద్రాద్రి ప్లాంటేషన్), 56 కి.మీ మేర ఎవెన్యూ ప్లాంటేషన్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులు, చేపట్టబోయే పనుల గురించి వివరించారు. అనంతరం పలువురికి ప్రశంసా పత్రాలను అందించారు. ఆర్డీవో రాజేశ్వర్, డీఈ లింగంపల్లి శివానందం, ఏఈ శివకృష్ణ, కౌన్సిలర్లు జావిద్, మీర్ నజీర్ అలీ, అబ్దుల్లా, పౌల్ ఉన్నారు.

ఉత్సవాల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

ఆర్మూర్‌టౌన్: దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి, ఫ్లోర్ లీడర్ జీవీ నర్సింహారెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు చేయడాన్ని నిరసిస్తూ ఆర్మూర్ పట్టణంలోని క్లాక్ టవర్ వద్ద బీజేపీ పట్టణ అధ్యక్షుడు జెస్సు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2018లో మంజూరైన రూ.70 కోట్ల నిధులను ఇప్పుడు మంజూరైనట్లు చెప్పడం సరికాదన్నారు. ఆర్మూర్ ఏరియా ఆస్పత్రిలో సరిపడా వైద్యులు లేరని, మౌలిక సదుపాయాలు కూడా లేవన్నారు. జిల్లా కలెక్టర్, ఆర్మూర్ మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిపై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. నాయకులు పాలేపు రాజు, కొంతం మురళీ, ద్యాగ ఉదయ్, పులి యుగేంధర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యతో ఉద్యోగ అవకాశాలు ఎక్కువ



మాక్లూర్: మండలంలోని దాస్‌నగర్ విజయ్ ఫార్మసీ కాలేజీలో శుక్రవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఫార్మసీ విద్యకు అధిక ప్రాముఖ్యత ఉందన్నారు. ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దటంలో కళాశాల ముందుంటుందన్నారు. ఫార్మసీ విద్యతో విదేశాల్లో స్థిరపడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ సంపత్‌రావు, డాక్టర్ సుబ్బ రత్నం, లక్ష్మణ్ డిప్లా, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి కృషి చేయాలి



రుద్రూర్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ అంబర్ సింగ్ పిలుపునిచ్చారు. మోస్రా మండల కేంద్రంలో శుక్రవారం ఆయన పర్యటించి పార్టీ కార్యకర్తలను కలిశారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చురుగ్గా పని చేసిన 13 మంది కార్యకర్తలకు ప్రోత్సాహక నగదు కింద రూ.5 వేల చొప్పున అందజేశారు. నాయకులు కోత్మిర్‌కర్ లక్ష్మణ్, చందూర్ వైస్ ఎంపీపీ దశాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లను వెంటనే మంజూరు చేయాలి



పెర్కిట్(ఆర్మూర్): బీసీ రుణాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను వెంటనే మంజూరు చేయాలని ఎంపీపీ పస్క నర్సయ్య రెవెన్యూ అధికారులకు సూచించారు. ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ పస్క నర్సయ్య అధ్యక్షతన మండల సర్వ సభ్య సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ..దేగాం పీహెచ్‌సీ కేంద్ర ప్రభుత్వ నేషనల్ క్వాలిటీ అస్యూరెన్సు స్టాండర్డ్స్ పథకానికి ఎంపిక కావడానికి కృషి చేసిన వైద్య సిబ్బందిని అభినందించారు. అనంతరం అధికారులు తమ శాఖల పనితీరును సమావేశంలో చదివి వినిపించారు. జెడ్పీటీసీ సంతోష్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీటీసీలు ఎంసీ గంగారెడ్డి, హన్మాండ్లు, మహేందర్, సురేష్, ముక్తార్, రాజ్ కుమార్, బాల్ నర్సయ్య, లావణ్య, రాటం శిరీష, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో ఆర్మూర్



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపాలిటీ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణ ప్రగతి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆమె ఆవిష్కరించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. వైస్ చైర్మన్ షేక్ మున్ను, కమిషనర్ ప్రసాద్ చౌహాన్, కౌన్సిలర్లు, అధికారులు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు విద్యుత్ వినియోగదారుల సమావేశం

మాక్లూర్: ఈ నెల 17న ఉదయం 10 :30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మాక్లూర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ వినియోగదారుల సమావేశం ఉంటుందని విద్యుత్ అసిస్టెంట్ డివిషనల్ ఇంజనీర్ అశోక్ శుక్రవారం తెలిపారు. నందిపేట, మాక్లూర్‌కు చెందిన విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యుత్‌కు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా వినియోగదారుల సమావేశంలో అడిగి తెలుసుకోవచ్చన్నారు.

పది రూపాయల భోజనానికి ఏడాది



బోధన్: పట్టణ కేంద్రంలో ఏకచక్ర సేవా సమితి బోధన్ శాఖ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ సహకారంతో అమలు చేస్తున్న రూ.10 కే భోజనం కార్యక్రమానికి ఏడాది పూర్తయింది. శుక్రవారం ఆర్టీసీ కొత్త బస్టాండ్‌లో ప్రజలకు భోజనం అందించారు. ప్రతి రోజు మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో భోజనం అందిస్తున్నారు. నిత్యం 200 మంది ప్రజలు భోజన సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారని నిర్వాహకులు తెలిపారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	ఆదిపురుష్ (3డీ–తెలుగు) – 3.10 ది ఫ్లాష్ – 12.00, 6.55, 10.05
స్క్రీన్-2 –	ఆదిపురుష్ (3డీ–తెలుగు) – 8.00, 11.45, 3.30, 7.15, 11.00
స్క్రీన్-3 –	ఆదిపురుష్ (2డీ–తెలుగు) – 10.30, 2.15, 6.00, 9.45
స్క్రీన్-4 –	ఆదిపురుష్ (2డీ–తెలుగు) – 11.00, 2.45, 6.30, 10.15